


# సర్వశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్వశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**"గాంధారి శాపమా?"** ఆశ్చర్యంగా అన్నాడు శ్రీనివాస్. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. అందరూ ఒక రకమైన ఆశ్చర్యంతో షాక్‌లో ఉన్నారు. చెప్పాల్సిందంతా చెప్పి మట్టూ అందరి మధ్య నిలబడి ఉన్నాడు.

"అప్పటి అస్త్రాలకంటే ఇప్పటి ఆయుధాలు, మిస్సైల్స్, ఇంటర్ కాంటినెంటల్ బెలాస్టిక్ మిస్సైల్స్, కొన్ని వందల రకాల అత్యంత శక్తిమంతమైన క్షిపణుల శ్రేణులు. అణ్వస్త్రాలు, రసాయన, జీవ ఆయుధాలు చెప్పలేనన్ని లెక్కపెట్టలేనన్ని ఉన్నాయి. ఆకాశం భూమీ మాత్రమేకాక సముద్ర జలాల్లోనూ మోహరించి ఉన్నాయి.

కోవిడ్ రకాల వంటి సూక్ష్మ జీవులలో సృష్టించిన విధ్వంసం మనం చూసింది ఒకటిలో వెయ్యోవంతు మాత్రమే. ఆమ్ల వర్షాలు కురిపించే పద్ధతులు ఏనాడో మనిషి డెవలప్ చేశాడు. కొన్ని లక్షల జంతువుల మీద జరుగుతున్న లాబరేటరీ పరిక్షలు ఏ ప్రయోజనం ఆశించి జరుపుతున్నారో ఆయా దేశాధినేతలకి మాత్రమే తెలుసు. ఇప్పటికే అయిదారు దేశాల మధ్య యుద్ధం అనే చిచ్చు భగభగా మండుతోంది. అది ఖండాంతరాలకి లేక ఖండాలకి వ్యాపించడమే తరవాయి, ముప్పుని ఎవ్వరూ ఊహించలేం, నష్టాన్ని ఎవ్వరం లెక్కపెట్టలేం" అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

"అవును ఇవాళ ప్రతి చిన్న దేశము అత్యధికంగా డబ్బుని ఖర్చుపెడుతున్నది ఆహారానికీ, పేదరిక నిర్మూలనానికీ కాదు. వాళ్ళు ఖర్చు పెడుతున్నది దేశ రక్షణ వ్యవస్థకి. ఒక్క సంవత్సరం గనక అన్ని దేశాలూ తమ రక్షణ బడ్జెట్‌ని సంయుక్తంగా పేదరిక నిర్మూలనానికీ, వైద్య, విద్యా వ్యవస్థలకోసం ఖర్చుపెడితే, 'పేదరికం' అనేది భూమ్మీద మళ్ళీ కనిపించదు.

కానీ చేసేదెవరు? ప్రతివాడికీ మరొకవాడిమీద అపనమ్మకమే. ప్రతీ దేశానికీ మరో దేశం మీద అసూయా భయాలే. దేశనాయకుల మధ్యనున్నది స్నేహమూ శాంతీ కాదు. అహంకార అభద్రతా భావాలు. 'వసుధైక కుటుంబం' అని మనం అంటున్నాం. మిగతా దేశాలు ఊహలో కూడా ఎందుకు అనుకోవూ? ఎన్ని సార్లు పొరుగు దేశం మనని వెన్ను పోటు పొడిచింది. ఎన్నిసార్లు చైనా ఓ వైపు హిందీ చీనీభాయీ భాయీ అంటూనే మన నమ్మకాన్ని హత్య చేసింది. అయ్యా... పురాణవైరమనేది ఇప్పటిది కాదు. పంచభూతాలున్నంత వరకూ స్నేహం, శాంతి ధర్మ సత్యం ప్రేమ అహింస అనేవి అందని ఫలాలే" సుదీర్ఘంగా నిట్టూర్చి అన్నది మదాలస.

"రామజోగీ నువ్వేమంటావ్?" అన్నారు యజ్ఞప్ప.

"చిన్న చిన్న కాలువలే నదిగా మారుతై. నదులు సముద్రాలుగా మారుతై. ఇదో సహజ ప్రక్రియ. పంచభూతాలతో తయారైనదైనా, నిర్మించినదైనా ఏదీ శాశ్వతంకాదు. అవి నశించి తీరాల్సిందే. ఓ యుద్ధం జరిగిన తరవాత శాంతి నెలకొంటుంది. కొంతకాలం మాత్రమే సుమా. మళ్ళీ అశాంతి ప్రబలుతుంది. మొదలంటా నరికిన చెట్టుకి మళ్ళీ కొమ్మలు చివురించినట్టు ఆ కొమ్మలు మళ్ళీ మహావృక్షంగా మారినట్టూ, అశాంతి పెరిగి పెరిగి హింసకి దారి ఇస్తుంది. ఇంకేమి కావాలీ? శాంతికోసం మరో యుద్ధం చెయ్యాలి. అయ్యా ఇది ఇలా జరిగిపోతూనే ఉంటుంది. 'గాంధారీ శాపం' అన్నది ఆ వృద్ధురాలు. నూరుగురు బిడ్డల్నీ మనవల్నీ ఓ మహాయుద్ధంలో పోగొట్టుకున్న గాంధారి శాపాలు పెట్టక వరాలిస్తుందా? నూరుగురూ దుష్టులేనా? కేవలం నూరుగురు దుష్టులవల్లే 18 అక్షౌహిణీల సైన్యం సర్వనాశనమయిందా? ఆలోచించండి.. కాలం దృష్టిలో ప్రళయం అనివార్యమైన 'ధర్మం' లాంటిది. మనిషి దృష్టిలో ఇది అన్యాయం, అక్రమం, అధర్మం. మరి తాను చేస్తూన్న అన్యాయాలనే అక్రమాలకీ అధర్మాలకీ మనిషి ఏం జవాబు చెబుతాడు? ఏం జవాబు చెప్పగలడూ?" సూటిగా అందరివంకా చూసి అన్నాడు రామజోగి. ఎప్పుడూ మృదువుగా మాట్లాడే రామజోగి నోట ఇటువంటి తీవ్ర సంభాషణ వినని మట్టూ ఆశ్చర్యంతో నివ్వెరపోయాడు.

అందరూ వింటున్నారు. "మీరన్నది నిజమే.. ప్రకృతిని ధ్వంసం చేసేది మనిషే కాదనను.. కానీ యీ ధ్వంస రచన కూడా ప్రకృతిలో ఓ భాగమే" అన్నాడు శ్రీనివాస్.

"ఎలా?" అన్నది శరద్వతి. తెలుగు ఆమెకి బాగా తెలుస్తోంది ఇప్పుడు. అంతేకాదు ఆమె సూక్ష్మగ్రాహి కూడా

"ఉదాహరణకి ఎలుకలు, వాటిని నియంత్రించకపోతే లక్షలు కోట్లుగా పెరిగి మనిషికి గింజ కూడా మిగల్చవు. వాటిని వేటాడి తింటాయి గనకనే పాముల్ని రైతులు చంపరు. సరే, ఎలుకల్ని నియత్రించడానికి పాములు ఉన్నట్లే పాముల్ని నియంత్రంచడానికి గద్దలు ఉన్నాయి. అలాగే అడవిలో చూస్తే లేళ్ళని నియంత్రించే పులులూ, సింహాలు, కుప్ప తెప్పలుగా పెరిగే కుందేళ్ళని నియంత్రించడానికి బోలెడన్ని మాంసాహార జంతువులు ఉన్నాయి.

కాలక్రమేణా కొన్ని యీ లోకం నించి నిష్క్రమించక తప్పదు. డైనోసార్లలాగా, డోడో పక్షుల్లాగా కొన్ని వందల జాతులు ఇప్పుడు మనకి కనపడవు. అంటే, అవి పూర్తిగా నశించాయనిగాదు. మరో కాలంలోనో మరో యుగంలోనో మళ్ళీ ప్రత్యక్షమవుతాయి. అయ్యా హింస – అహింస, సృష్టి – లయ, న్యాయం – అన్యాయం, సత్యం – అసత్యం, ధర్మం – అధర్మం, శాంతి – అశాంతి సుఖం – దుఃఖం, చీకటి – వెలుగు ఇవన్నీ ద్వంద్వాలు ఎలాగో నిర్మాణం – విధ్వంసం కూడా రూపాయి నాణానికి ఉండే బొమ్మా బొరుసుల్లాంటివి. గాంధారి 'శాపం ' కూడా భవిష్యత్తులో కొందరికి 'వరం ' కావచ్చు.

"కాలగమనాన్నీ, కాల రహస్యాన్నీ తెలిసినవారు ఎవరు?" అన్నాడు శ్రీనివాస్.

"ఇంకేం జరిగింది మట్టూ?" అడిగారు పరమేశ్వర శాస్త్రిగారు. అయోమయంగా తలగోక్కున్నాడు మట్టూ.

"నువ్వు చెప్పవలసినవన్నీ చెప్పావు. కానీ కొన్ని విషయాలు యీ సంఘటనకి సంబంధం లేని విషయాలుగా ఉంటై. అవి అప్రస్తుతం అనికూడా అనిపిస్తాయి. కానీ, అవీ ముఖ్యమైనవే. తొందరేమీలేదు. బాగా ఆలోచించుకునే చెప్పు" అన్నారు శాస్త్రిగారు.

"భోజనాల సమయం అయింది. అందరికీ ఇదే నా ఆహ్వానం" అన్నారు టివిఎస్ గారి భార్య విమల సుందరి. ఆవిడది చక్కటి నవ్వు ముఖం.

అందరూ లోపలకి వెడితే మట్టూ మాత్రం వాకిట్లో ఉన్నాడు. "మట్టూ మరోసారి సుస్వాగతం" అన్నారు టివిఎస్.

"అది కాదండీ" సందేహించాడు మట్టూ.

"అబ్బాయ్.. నేను డాక్టర్ని. నా దృష్టికి ఇద్దరే కనపడతారు. ఒకటి పేషెంట్లు, రెండు మనుషులు. కులాలు, మతాలూ ఇవేమీ నాకూ మా ఆవిడకీ కనబడవు. కనుక ఆనందంగా వచ్చిమాతో కూర్చో" మట్టూ భుజం మీద చెయ్యివేసి లోపలికి తీసుకెళ్ళారు డాక్టరుగారు.

న్యూస్‌లో న్యూఢిలీ విధ్వంసం మళ్ళీ ప్రచారమయింది. మట్టూతో పాటు అందరూ టివి చూశారు.

"ఆట మొదలైందంటారా?" కుతూహలంగా అడిగాడు శృంగి.

"చిమ్మచీకట్లో ఓ రోడ్డుమీద ఉన్నావనుకో కాసేపటి తరవాత దూరంగా ఓ రెండూ లైట్లు, అంటే ఏ లారీ లైట్లో కనబడతాయి. ముందు కనిపించేది సుదూరాన ఉన్న లైట్లే. వాటి వల్లనే చుట్టుపక్కల ప్రదేశాలు కనిపించవు. అవి దగ్గరకు వచ్చిన కొద్దీ నీవుండే చోటు ప్రకాశితమవుతుంది. ఇంకా దగ్గరికొస్తే నీ చుట్టూ ఉన్నవి ఇంకా వివరంగా కనిపిస్తై. వచ్చి

వచ్చి నిన్ను దాటి పోయిందనుకో? మళ్ళీ మామూలే – చీకటే. ఇక్కడి ప్రశ్న ఏమంటే, అంతదూరంనుంచీ నీదాకా రావడానికి కొన్ని నిముషాలు పడితే, మనల్ని దాటిపోవడానికి అరక్షణం కూడా పట్టదు. అలాగే యీ సంఘటనలన్నీ ఆ లైట్ల మాదిరిగా ఆపదని సూచిస్తున్నాయి. విధ్వంసం సంగతా? క్షణం పట్టదు" అన్నారు యజ్ఞప్ప.

"షౌకత్ అనే ఒక్క భవంతి మాత్రం నిలిచి మిగతావన్నీ కుప్పకూలిపోవడం దేనికి సంకేతం?" అడిగింది మదాలస.

"చెప్పారుగా.. ఓ పిల్లవాడు ఆ భవంతిలో పుట్టాడనీ, అతడు పుట్టాక ఏడవలేదనీ నవ్వాడనీ! చిత్రం ఏమంటే, ఆ మాట చెప్పింది ఆ బిడ్డకి పురుడుపోసిన మంత్రసాని. ఆమెకూడా ఆ దుర్ఘటనలో చనిపోయిందని కూడా చెప్పారు. ఇక్కడ రెండు ప్రశ్నలు ఉత్పన్నమౌతాయి. ఒకటి, అప్పుడే పుట్టిన పిల్లవాడు నవ్వుతాడా? నవ్వాలంటే ఆనందం కలగాలి. అప్పుడే పుట్టిన శిశువుని ఆనందం, ఆశ్చర్యం, విచారం వంటివి అసలు తెలియనే తెలియదుగా! మహా తెలిస్తే బొడ్డు కోసిన తాలూకు 'నెప్పి' తెలిస్తే తెలిసి ఉండొచ్చు నెప్పితో ఎవరైనా నవ్వగలడా? రెండో ప్రశ్న ఏమంటే, జరిగినదానికీ, ఆ బిడ్డ జననానికీ సంబంధం ఏమైనా ఉందా? మూడు మంత్రసాని మృత్యువునే, బిడ్డజననానికీ, జరిగిన దుర్ఘటనకీ ఏమన్నా సంబంధం ఉందా? నాలుగు, కొన్ని వందలమందో వేలమందో మృత్యువు పాలయ్యారు. ఎందువల్ల? భూకంపంలాంటిది లేదు – అగ్నిప్రమాదాలు లేవు. వర్షాలూ వరదలూ లేవు. ఘోరం మాత్రం జరిగిపోయింది. ఇవన్నీ ప్రశ్నలు. వీటికి సమాధానాలు సంపాదించగలిగితే — కొంత మనం సాధించినట్లే" అన్నారు యజ్ఞప్ప.

"సుదర్శన్ ఉంటే బాగుండేది.. గవ్వలు వేసి అన్నా కొంత ఇన్ఫర్మేషన్ ఇచ్చేవాడు" అన్నారు శాస్త్రిగారు.

రామజోగి మౌనంగానే ఉన్నాడు. మౌనంగా భోంచేస్తున్నాడు. మట్టూ కూడా మౌనంగానే భోంచేస్తున్నాడు. విమలసుందరి శరద్వతి వడ్డిస్తున్నారు. మదాలస వారిద్దరికీ అధరువులు ఉన్న పాత్రల్ని అందిస్తోంది. యజ్ఞప్పగారన్నారు "పోనీ సుదర్శన్‌ని పిలిపిద్దామా?" అని.

"వద్దు" అసంకల్పితంగా అన్నాడు రామజోగి.

"ఎవరో మంత్రించినట్టూ జరిగిందట. ఇప్పటి వరకూ కారణాలు తెలియలేదు. పురుడు పోసిన మంత్రసాని పేరు నిర్మల్ త్యాబ్జీ. ఆమె చాలా అనుభవశాలి అనీ, పురుడు పోసాక 'భవంతి' వారి 'సార్టు'లో ఇంటికి వెళ్ళిన గంటన్నరకి యీ సంఘటన జరిగిందనీ, ఆ పిల్లవాడికి తాను 'షగున్' అని పేరు పెట్టాననీ చెప్పిందిట" అన్నాడు మొహమ్మద్ అతీం. ఢిల్లీ కరస్పాండెంట్.

"ఓ బిడ్డ జననానికీ కొన్ని వేల ఇళ్ళు నేలమట్టమవడానికీ, కొన్ని వేలమంది చనిపోవడానికీ సంబంధం ఉందంటారా? సర్కాస్టిక్‌గా అన్నడు రాబీ.

"ఒక దుర్యోధనుడు పుట్టేముందు అనేకానేక దుశ్శకునాలు కనబడ్డాయి. ఒక ఏసుక్రీస్తు జననానికి ముందు మూడు దివ్యతారలు ఆకాశాన్ని వెలిగించాయి. అంతెందుకూ, కొంతమంది మహానుభావులు శిశువులుగా ఉన్నప్పుడు

నాగుపాములు తమ పడగలతో నీడపట్టాయని చెబుతారు. అయ్యా.. యీ భూమి పేరు భరతభూమి. అంటే భరతుడు పాలించిన భూమి. లేదా, భరతుడు పాలించాడు గనక భరత భూమి. ఆ భరతుడి పుట్టుక ఎట్లాంటిదీ? సామాన్యమైనదా? లేదా! భరతుడు పుట్టాలంటే, ముందు ఆమె తల్లి పుట్టాలి. ఆ తల్లి సామాన్యురాలా? ఓ అప్సరస మేనకకీ, ఓ రాజర్షి తపఃసంపన్నుడూ అయిన విశ్వామిత్రుడికీ పుట్టింది. కణ్వమహర్షి ఇంట పెరిగింది. దుష్యంతుడ్ని వివాహమాడి, వెళ్ళగొట్టబడింది. అప్పుడు.. అప్పుడు పుట్టాడు భరతుడు.

అంటే, ప్రతి పుట్టుక వెనుకా ఓ రహస్యం ఉంటుంది. ప్రతి ఘటనకీ ఓ ప్రతిఘటన వున్నట్లుగానే, ప్రతి పుట్టుక వెనకా మనకి తెలియని ఓ పరిణామ రహస్యం ఉంటుంది." సంభాషణలో తనంత తానే పాలుపంచుకుని అన్నాడు మహదేవన్.

"యా ఆల్ రైట్ సార్. లేకపోతే ఓ పశుల కాపరి నాటకాలు వేసి కన్నడ కంఠీవర అవగలడా? ఓ బస్ కండక్టర్ సూపర్ స్టార్ అవగలడా? ఓ పెట్రోలు బంకు వర్కర్ ఓ మహా సామ్రాజ్యాన్ని స్థాపించగలడా? ఓ ఆరణాల కూలీ, ఓ చాయ్‌వాలా ఓ ముఖ్యమంత్రీ ప్రధానమంత్రీ కాగలరా? ప్రతి పుట్టుక వెనుకా ఓ భగవంతుని ప్రణాళిక ఉన్నదని నేను నమ్ముతాను. ఇప్పుడు మా సంగతే చూడండి. మేమందరం తలో రాష్ట్రం వాళ్ళం. మాలో కొందరు విదేశీయులూ ఉన్నారు. కానీ, మూడు గంటల క్రితం మీరెవరో మాకూ, మేమెవరో మీకూ తెలీదు. అయినా మేం మీ ఇంట్లో ఎలా కూర్చొనగలిగాం?

మేం వచ్చింది యీ రాబీ అనబడే రాబర్ట్ వెబ్‌స్టర్‌ని కలవడానికి. రమణ మహర్షి ఆశ్రమంలో ఇతను బస చెయ్యలేదు. కానీ ఇతన్ని మేం కలిసింది ఆశ్రమంలో. ప్రవష్ఠి అనే యీ కుర్రాడు ఉంటాడనీ, ఉన్నాడనీ మేం ఊహించనుకూడాలేదు. అలాంటిది అతన్ని యీ రాబీతో ఉండగా కలిశాం. అతను మీ యింటికి మమ్మల్ని ఎందుకు పిలుచుకొచ్చాడూ? మీ అమ్మాయి మా కందరికీ ఎందుకు ఆతిధ్యమిచ్చిందీ? ఆలోచిస్తే అన్నీ ప్రశ్నలే. ఓ విధంగా మేము ఇక్కడికి రావడానికి కూడా ఓ ప్రణాళిక ఉండే ఉంటుంది" అన్నాడు సచేత్ దద్లాని.

జయ్ చిన్నగా తల పంకించాడు. రాబీ మొహంలో పెద్ద మార్పులేదు.

"మీరందరూ ఎందుకు సమావేశమయ్యారో నాకు తెలీదు. మీరు చెప్పాలని కూడా నేను కోరుకోను. అయితే యీ తిరుమణ్ణామలైలో ఓ చిత్రం వుంది. దాన్నే గిరి ప్రదక్షిణం అంటారు. కొండని ప్రదక్షిణం చెయ్యాలంటే 14కిలోమీటర్లు నడవాలి. ఆ కొండని అరుణాచలం అనీ అరుణగిరి అనీ అంటారు. నడిచే భగవంతుడిగా పూజింపబడ్డ రమణమహర్షి, సారీ, భగవాన్ రమణ మహర్షి చాలా తరచుగా గిరిప్రదక్షిణం చేసేవారు" ఆగారు మహదేవన్.

"అవును.. పౌర్ణమిరోజున కనీసం అయిదారు లక్షలనించి పది లక్షల వరకూ భక్తులు ప్రదక్షిణం చేస్తారని విన్నాను" అన్నాడు జయ్.

"అలానూ చేస్తారు. అలా కాకుండా ఏ రోజైనా ప్రదక్షిణం చెయ్యవచ్చు. అయితే దానికి కావాల్సింది అమితమైన శ్రద్ధ, భక్తి, నమ్మకం. అలా ప్రదక్షిణ చేసే సమయంలో మీ సమస్యలకి సమాధానాలు దొరుకుతాయని పెద్దలు చెప్పారు. అంతెందుకూ కొన్ని 'పదు 'ల సార్లు నా సమస్యలకి పరిష్కారం ప్రదక్షిణలు చేస్తున్నప్పుడే స్ఫురించాయి. మీలో నమ్మకం ఉన్నవారు గిరి ప్రదక్షిణద్వారా మీ సంశయలకి సమాధానాలు పొందవచ్చు" అన్నారు మహదేవన్.

"మన మనసులకీ స్ఫురిస్తాయా?" అడిగాడు శమంతో.

"అలాగూ ఉంది. మరో పద్ధతీ ఉంది. ఎవరో ఓ మనిషో, సంసారో, సన్యాసో మన ప్రయత్న్మ లేకుండానే మనకి పరిష్కారం చెబుతాడని. అయ్యా.. గిరిచుట్టూ చిన్న చిన్నవి పెద్దవి దేవాలయాలే. ప్రతి గుడి ముందూ బోలెడంత మంది కాషాయ వస్త్రధారులే. వారిలో కొందరు నిజమైన సన్యాసులు ఉంటే, కొందరు కేవల పొట్టకూటికోసం, కాషాయం కట్టుకు తిరిగేవాళ్ళు. అది సబబో, బేసబబో వారికే వదిలిపెడితే, అందరిలోనూ భగవంతుడున్నాడనేది నిజం. 'ముఖే ముఖే సరస్వతి' అనేది ఇంకా ఇంకా నిజం" అన్నారు మహదేవన్.

"మన సమస్య ఎటూ తేలేట్టు లేదు. పోనీ ఓ ట్రైల్ వేద్దామా" అన్నాడు గోర్కీ అందర్నీ చూసి. మహదేవన్‌గారు సంభాషణ అంతా ఇంగ్లీషులోనే ఉండటం వలన ఎవరికీ ట్రాన్స్‌లేట్ చేసి చెప్పాల్సిన పని ఉత్పన్నమవలేదు.

"షీర్ రెడిక్యులస్" అన్నాడు మొహమ్మద్ అతీం. అతను ఏ మతాన్నీ గొప్పగా నమ్మడు. టూ ప్రాక్టికల్.

"అయినా నీకూ తప్పదు అతీం.. బై ఛాన్స్ అలా సమస్య పరిష్కారం చెప్పేవాడు ముస్లిం అయితే? అతను చెప్పింది మాకు వివరించడానికి నువ్వుండాలిగా!" పెద్దగా నవ్వి అన్నాడు శమంతో భట్టాచార్య. చిన్నగా నవ్వాడు అతీం.

"అయ్యా.. మా గురువు ఓ ముస్లిం. అతనో మాట చెప్పాడు" మధ్యలో కల్పించుకుని అన్నాడు మహదేవన్.

"ఏమన్నారూ?" అడిగాడు జయ్ కుతూహలంగా

"మొహమ్మద్ అనే పేరుని విడదీస్తే మొహము ప్లస్ మదము. ఆ రెంటినీ విడిచిన మహానుభావుడే మొహమ్మద్. హిందీలో మోహ్, మద్ అంటాంగదా. అలాగన్నమాట. మోహాన్నీ మదాన్నీ విడిచిపెట్టమనేగా మన శాస్త్రాలూ ఉపనిషత్తులూ ఘోషించేదీ" అన్నారు మహదేవన్.

"అద్భుతమైన నిర్వచనం. మోహ మదాలని జయించిన వాడే మొహమ్మద్ అనడం" చప్పట్లు చరిచారు దద్లానీ, జయ్, ప్రవస్థి, శమంతో.

"యస్.. అద్భుతం. నేను ఇప్పటివరకూ వినలేదు" అన్నాడు సబర్‌జీత్ సింగ్ (హర్యానా)

ఏ మతం అయినా అనుచరులకు బోధించేది మంచినే. ఒకప్పుడు 'కులం' వల్ల నిరుద్యోగ సమస్య చక్కగా పరిష్కరింపబడింది. అంతేకాదు మనిషి చనిపోయినా అతని అనుభవం చనిపోకుండా కులం కాపాడింది. అలాగే మతం మానవుడి ప్రవర్తనను సరిదిద్దడానికి ఏర్పడింది. అంటే మనిషి సంఘ ప్రవర్తన సరిగ్గా ఉండేలా మతం ఉపయోగపడింది.

అయ్యా ఒక్క మనిషికి తప్ప సృష్టిలో కులాలూ మతాలూ ఏ జీవికైనా ఉన్నాయా? లేవు. ఎందుకంటే, మరింత మెరుగైన సమాజం కోసం కొన్ని వందల సంవత్సరాలు పరిశోధనా ఫలితాలే కులమతాలు. ఇప్పుడు వాటి అవసరంలేదని అనను... వాటిని సమర్ధవంతంగా వినియోగించుకోగలిగితే" అన్నాడు మహదేవన్.

ఆ రోజు గిరి ప్రదక్షిణ చెయ్యాలనే నిర్ణయం అందరిలోనూ స్థిరపడింది. జయ్ లేచి అన్నాడు "ఇప్పుడు టైం నాలుగు. లెట్స్‌గో" అని మహదేవన్‌తో సహా అందరూ లేచారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments